TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

సంపుటి : 01 సంచిక : 27?7 | బుధవారం,జూన్ 11, 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990





### ఢిల్లీలోనే మకాం వేసిన సిఎం రేవంత్

# మంత్రులకు శాఖల కేటాయింపులపై కసరత్తు

## కొందరు మంత్రుల శాఖల మార్పుపైనా చర్చ



- కెసి వేణుగోపాల్, ఖర్గేలతో సిఎం మంతనాలు
- పిలుపు రావడంతో హుటాహుటిన ఢిల్లీకి మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,జూన్10:**
తెలంగాణ మంత్రుల శాఖల్లో భారీ మార్పులకు అవకాశం ఉన్నట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు శాఖల మార్పులపైన కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండురోజులుగా ఢిల్లీలో మకాం వేసిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇకపోతే సోమవారం కాంగ్రెస్ కార్యదర్శి కేసీ వేణుగోపాలతో గంటకుపైగా రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి బేటి అయ్యారు. ఖర్గేతో భేటీ తరువాత మంత్రుల శాఖల మార్పులు ఖరారు కానున్నాయి సమాచరం. అలాగే కొత్త మంత్రులకు కూడా శాఖల కేటాయింపు జరుగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం వివిధ శాఖలను నిర్వహిస్తున్న మంత్రుల శాఖల్లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయని ప్రచారం నడుస్తోంది. మంత్రి పదవులే కాదు.. శాఖల కేటాయింపుల్లోనూ సామాజిక న్యాయంకు ప్రాధాన్యత నివ్వాలని కాంగ్రెస్ అధిష్టానం పేర్కొంది. కొందరు మంత్రుల పనితీరు సరిగా లేదంటూ ఇప్పటికే కొందరు పార్టీ నేతలు అధిష్టానానికి నివేదించారు. అలాగే మంత్రుల పనితీరుపై ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధిష్టానానికి నివేదిక ఇచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, వివిధ స్థాయి నేతలతో భేటీలో అందిన సమాచారం ఆధారంగా ఆమె నివేదికలు రూపొందించారు. కీలక శాఖల బాధ్యతలు అన్ని కొందరు మంత్రులే నిర్వహిస్తుండటంతో పని భారం కారణంగా కొన్ని శాఖల్లో ఆశించిన ఫలితాలు రావట్లేదనే అంచనలో కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు. మంత్రుల పనితీరు వ్యవహార శైలిపై కేసి వేణుగోపాల్ గతంలోనే ఢిల్లీలో సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాలు, మంత్రుల వ్యవహార శైలి, పనితీరుపై తన అంచనాలను అధిష్టాన ముఖ్యులతో సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. విద్య, మున్సిపల్ పట్టణాభివృద్ధి, హోం, న్యాయం సహా పదికి పైగా కీలక శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖను విడగొట్టి మున్సిపల్ శాఖను మరొకరికి ఇచ్చే అవకాశం ఉంది. కాగా తనకు విద్యుత్తు లేదా విద్యాశాఖ ఇవ్వాలని వివేక్ కోరుతున్నారు.

మిగతాది 2లో



## కేసీఆర్ విచారణలో కీలక మార్పులు!

**హైదరాబాద్:**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ విచారణలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఓపెన్ కోర్ట్ కాకుండా ఇన్ కెమెరా విచారణ చేసే యోచనలో కమిషన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్ ఇన్ కెమెరా విచారణ? చేపట్టనుంది. దీంతో బహిరంగ విచారణకు కేసీఆర్ హాజరు కాకుండా ఇన్ కెమెరా ముందే కమిషన్ విచారణలో కేసీఆర్ పాల్గొననున్నారు.కమిషన్ అడిగే ప్రశ్నలకు ఇన్ కెమెరా సమాధానం చెప్పనున్నారు. ఇప్పటి వరకు కమిషన్ ముందు పాల్గొన్న వారిని ఓపెన్ కోర్టులోనే కమిషన్ విచారించింది. కేసీఆర్‌ను మాత్రం మాజీ సీఎం హోదాలో ఇన్ కెమెరా విచారణకు హాజరయ్యే అవకాశం కల్పించింది. నేడు కమిషన్ ముందు 115 సాక్షిగా కమిషన్ ముందు కేసీఆర్ హాజరు కానున్నారు.



2లో..

## మరోమారు రాజాసింగ్ హాట్ కామెంట్స్

- జూబలీ హిల్స్ ఉప ఎన్నికపై అప్పుడే రాజకీయాలు
- సొంత కులం వారికే టిక్కెట్ వచ్చేలా యత్నాలు



## హైదరాబాద్‌లో 300 ప్రాంతాల్లో వరద నీరు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్:**
వర్షాకాలం అత్యవసర బాధ్యతల అప్పగింతపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. విపత్తు నిర్వహణ అంతా ఒకే గొడుగు కింద ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధి మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను హైడ్రాకు అప్పగించినట్లు చెప్పారు. “హైదరాబాద్‌లో 300 ప్రాంతాల్లో వరద నీరు నిలుస్తోంది. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లపై గతంలో పర్యవేక్షణ ఉండేది కాదు. వరద నీరు.. చెరువులు, నాలాల్లోకి మళ్లించే వ్యవస్థ సరిగా లేదు. వరద నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేశాం. ఈ ఏడాది వర్షాకాలంలో సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం”అని రంగనాథ్ పేర్కొన్నారు.



## 11 ఏళ్లలో అవినీతి రహిత సమర్థ పాలన

- అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం
- ప్రపంచ దేశాలు భారత్‌వైపు చూసేలా చేసిన మోడీ
- 11 ఏళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకం విడుదల
- కార్యక్రమంలో మాట్లాడిని కేంద్రమంత్రికిషన్ రెడ్డి

**విజయవాడ,జూన్10:**
మోదీ నాయకత్వంలో.. ఈ 11సంవత్సరాలలో దేశంలోని అన్ని రంగాలు అభివృద్ధి పథంలో ముందుకి దూసుకెళుతున్నాయని భారత ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశంసల జల్లులు కురిపించారు. దేశ ప్రజల కోసం ఆయన అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించారని అన్నారు. విజయవాడ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దేశంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను మాట్లాడుతూ..

2లో..



2లో..

## బస్ పాస్ ధరల పెంపుపై నిరసన

- బస్ భవన్ ముట్టడికి కవిత యత్నం
- రోడ్డుపై బైఠాయించడంతో అరెస్ట్
- బస్ భవన్ ఎదుట బిఆర్ఎస్‌వి మెరుపు ధర్నా

**హైదరాబాద్,జూన్10:**
తెలంగాణ జాగృతి నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు. పెంచిన బస్ పాస్ ధరలను వెంటనే తగ్గించాలంటూ తెలంగాణ జాగృతి కార్యకర్తలతో కలిసి మంగళవారం బస్ భవన్‌ను ముట్టడించేందుకు కవిత ప్రయత్నించారు. ఆ క్రమంలో ఆమె ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ మేరకు కవిత, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. కవిత ధర్నాతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను చంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## కాంగ్రెస్‌లో పనిచేసే వారికే పదవులు: ఎమ్మెల్యే దానం నాగేందర్



**హైదరాబాద్:**
కాంగ్రెస్ పార్టీలో హామీలు ఉండవని.. పనిచేసే వారికే పదవులు దక్కుతాయని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. హిమాయత్‌నగర్‌లో రూ.60లక్షలతో రోడ్డు పనులను దానం ప్రారంభించారు. అనంతరం ఆదర్శ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో 150 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడారు. “సామాజిక న్యాయం పాటిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యం కల్పించారు. రాహుల్‌గాంధీ ఆశయాలను రేవంత్ ముందుకు తీసుకెళ్తున్నారు” అని దానం చెప్పారు. జీహెచ్ఎంసీ నుంచి మంత్రి పదవి వస్తుందా అన్న ప్రశ్నకు ఇంకా సమయం ఉందని.. వేచి ఉండాలని సూచించారు. నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించినవారికి దానం అభినందనలు తెలిపారు.

## బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు అనుకూలం



- తెలంగాణలో పెట్టుబడులతో షైవా గ్రూప్ భాగస్వామి
- రూ.2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూ
- ఏడాదిన్నరలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు
- ప్రైవేటు రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు
- ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**హైదరాబాద్,జూన్10:**
తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపించే ప్రభుత్వం అని ఐటీ- శాఖా మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు.

మిగతాది 2లో

# సంపాదకీయం

## నివురుగప్పిన నిప్పు



తుపాను ముందర ప్రశాంతత అంటే ఇదేనేమో! కొద్దివారాలుగా మణిపుర్ కొంత ప్రశాంతంగా ఉందని భ్రమిస్తున్నంత సేపు పట్టలేదు... ఆ రాష్ట్రం మరోసారి భగ్గుమంది. గత రెండేళ్ళుగా జాతి ఘర్షణల మధ్య చిక్కుకొని విలవిలలాడుతున్న ఈశాన్య రాష్ట్రం మళ్ళీ పతాక శీర్షికలకు ఎక్కింది. 2023 అల్లర్ల వేళ అనేక నేరాలకు పాల్పడినట్టు ఆరోపణలను ఎదుర్కొంటున్న మైతేయ్‌ల ర్యాడికల్ సంస్థ 'అరంబై తెంగోల్' (ఏటీ) నేత కనాన్ సింగ్‌ను సీబీఐ అరెస్ట్ చేయడంతో ఆదివారం ఉద్రిక్తత పెచ్చరిల్లింది. భగ్గుమన్న నిరసనల మధ్య రాష్ట్రంలో పలుచోట్ల కర్ఫ్యూ, అయిదు రోజుల పాటు ఇంటర్నెట్‌పై నిషేధం విధించాల్సి వచ్చింది. వివిధ పార్టీల ఎమ్మెల్యేలు 23 మంది ఆదివారం వెళ్ళి, గవర్నర్‌ను కలసి పరిస్థితిని వివరించి, సామరస్యపూర్వక పరిష్కారానికై అర్థించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వెరసి, కేంద్రం సుదీర్ఘ జాప్యం తర్వాత ఫిబ్రవరిలో ఎట్టకేలకు అసమర్థ బీరేన్ సింగ్ సర్కార్‌ను తప్పించి రాష్ట్రపతి పాలన విధించిందన్న మాటే గానీ, మణిపుర్‌ను యథాపూర్వ స్థితికి తీసుకురాలేకపోయింది. తాజా పరిణామాలే అందుకు నిలువెత్తు నిదర్శనం. మైతేయ్‌లకు ఎస్టీ హోదాను ఇవ్వడాన్ని కుకీ వర్గ ప్రజానీకం తీవ్రంగా వ్యతిరేకించడం రెండేళ్ళ క్రితం జాతుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఆర్థిక ప్రయోజనాలు, భూయాజమాన్యంపై అసలే దీర్ఘకాలంగా రెండు వర్గాల మధ్య నెలకొన్న అసంతృప్తి ఆ తాజా పరిణామంతో మరింత చిచ్చు రేపింది. అలా 2023 మే 3 నుంచి రాష్ట్రం అక్షరాలా తగలబడుతూనే ఉంది. ఈ ఘర్షణల వల్ల 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. బీరేన్ సింగ్ సారథ్యంలోని అప్పటి బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల రీత్యా ఒక వర్గానికి కొమ్ము కాస్తూ, పక్షపాతధోరణితో వ్యవహరించినట్టు ఆది నుంచీ ఆరోపణలున్నాయి. చివరకు భద్రతా దళాలు సైతం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడినట్టు వార్తలొచ్చినసంగతి మర్చిపోలేం. ప్రజలు, ప్రతిపక్షాల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా, బీరేన్‌ను మార్చడానికి ఇష్టపడని బీజేపీ అధిష్ఠానం తీరా గత ఫిబ్రవరిలో ఆయనను పక్కకు తప్పించినా పుణ్యకాలం గడిచిపోయింది. 2022 ఫిబ్రవరి నాటి ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ మద్దతు కూడగట్టుకొని అధికారం చేపట్టినా, పట్టుమని పదిహేను నెలలకే రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. మొత్తం 60 మంది సభ్యు లున్న మణిపుర్ అసెంబ్లీలో నిజానికి బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలున్నారు. రాష్ట్రం అతలాకుతల మవుతున్న వేళ... బీరేన్ స్థానంలో అన్ని వర్గాలకూ అనుకూలుడైన కొత్త వ్యక్తిని సీఎం కుర్చీలో కూర్చోబెట్టి, రాష్ట్రపతి పాలనను నివారించి ఉండవచ్చు. కానీ, సీఎం అభ్యర్థిపై సొంత పార్టీలోనే ఏకాభిప్రాయం కుదరలేదు. పైగా, కుకీ%-%జో వర్గానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు ఏడుగురు ఘర్షణలు మొదలైన నాటి నుంచి సభకు దూరంగా ఉండడం ఆ పార్టీకి తలనొప్పిగా తయారైంది. చివరకు, ఘర్షణలు మొదలైన 21 నెలల తర్వాత రాష్ట్రపతి పాలనే శరణ్యమైంది. కానీ, అప్పటికే చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది. ఈశాన్య భారత అభివృద్ధికి తామే బాటలు వేస్తున్నామంటున్న పాలక పార్టీ మణిపుర్ వ్యవహారాన్ని సరైన రీతిలో చక్కదిద్దలేకపోయిందన్న శాశ్వత అప్రతిష్ఠను మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాష్ట్రపతి పాలన విధించినా, పర్వత ప్రాంత రాష్ట్రంలో పరిస్థితి నేటికీ నివురు గప్పిన నిప్పులానే ఉందని శని, ఆదివారం నాటి ఘటనలు మరోమారు ఋజువు చేశాయి. అక్కడి ఉద్రిక్తతను ప్రపంచానికి నివేదిస్తున్న విలేఖరులు సైతం శనివారం భద్రతా బలగాల దాడికి గురయ్యారు. పాత్రికేయులపై రాష్ట్రంలో పదే పదే జరుగుతున్న దాడులకు నిరసనగా చివరకు సోమవారం మణిపుర్‌లోని ప్రధాన పత్రికలన్నీ తమ పేపర్‌లో సంపాదకీయ స్థానాన్ని ఖాళీగా వదిలేశాయి. పత్రికలన్నీ సమష్టిగా నిలిచి ఇలా అరుదైన రీతిలో తమ నిరసన తెలియ జేయడం ఓ బలమైన సందేశం. మణిపుర్‌లో ఇప్పటికీ మామూలు పరిస్థితులు లేవనడానికి ప్రతీక. అసలు రెండేళ్ళ క్రితం ఘర్షణలు చెలరేగగానే ఆ ఏడాది జూన్ 4న కేంద్రం ముగ్గురు సభ్యుల విచారణ సంఘం వేసింది. పదే పదే పొడిగింపుల ప్రహసనంతో సదరు సంఘం కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ దాకా దేకింది. అప్పటికైనా ఆ సంఘం కొత్తగా తేల్చేదేమిటో, దాని నివేదికతో ఒరిగేదేమిటో చెప్పలేం. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందని 2023 ఆగస్టులో సుప్రీమ్ కోర్ట్ వ్యాఖ్యానించినా మన ఏలికలకు చీమ కుట్టినట్టయినా లేదు. నష్టనివారణలో చిత్తశుద్ధి కరవైంది. రాష్ట్రపతి పాలనతో పరిస్థితి మెరుగువతుందనుకుంటే అడియాసైంది. గవర్నర్ సైతం ఇంఫాల్ విమానాశ్రయం నుంచి ఇంటికి హెలికాప్టర్‌లో వెళ్ళాల్సిరావడం దిగ్భ్రాంతికరం. సాక్షాత్తూ బీజేపీ ఎంపీ ఒకరు 2020లో స్థాపించిన 'ఏటీ' సాయుధ పౌరసైన్యంగా మారి హింసకు పాల్పడి, ఆయుధాలను కొల్లగొట్టినట్టు కథనం. ఎవరెన్నిమార్లు అభ్యర్థించినా, ఇప్పటికీ ఆయుధాలను అప్పగించ లేదు. రేపు అవి మరే నేరగాళ్ళ చేతిలో పడి, ఎక్కడకు దారి తీస్తాయో ఊహించలేం. గతంలో పలు తీవ్రవాద వర్గాలు నిషేధానికి గురైనా, ఇప్పటికీ ఏటీని ఎందుకు నిషేధించలేదంటే జవాబూ లేదు. ఇంత జరుగుతున్నా ప్రధాని పెదవి విప్పకపోవడం, ప్రపంచమంతా తిరుగుతున్నా ఈశాన్యంలో పర్యటించి భరోసా ఇవ్వకపోవడం సమర్థించలేం. ఇప్పటికైనా తీవ్రతను గుర్తించి, విభిన్న వర్గాల మధ్య సామరస్యానికి కృషి చేయాలి. హింస కన్నా అభివృద్ధి ముఖ్యమని నచ్చజెప్పాలి. వేలాది సగటు మణిపురీలు అనేక నెలలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకోవాల్సి రావడం అన్ని పార్టీల సమష్టివైఫల్యం. ఇది ఇలాగే కొనసాగితే మానవత్వానికే మాయనిమచ్చ. దేశసమగ్రతకే ప్రమాదం.

# 11 ఏళ్లలో అవినీతి రహిత సమర్థ పాలన

మొదటి పేజీ తరువాయి

గత 11 సంవత్సరాల్లో భారతదేశం అనేక రంగాల్లో అసాధారణ పురోగతి సాధించిందని స్పష్టం చేశారు.' ఒక్క రూపాయి అవినీతి జరిగిందని ఏ రాజకీయ పార్టీ కూడా ఆరోపణలు చేయలేదని, నీతి నిజాయితీతో ఒక సమర్థవంతమైన నాయకత్వంతో మోదీ పాలన కొనసాగుతోందన్నారు.. ప్రపంచ దేశాలు సైతం భారత దేశం వైపు చూసేలా మోదీ పాలన సాగుతోంది. అన్ని సామాజిక వర్గాల వారికి పెద్దపీట వేసి పాలన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపట్టిన అనేక పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా ప్రణాళికలు ఉంటున్నాయి. కరోనా సమయంలో పేద ప్రజలు ఎవరు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో రేషన్ అందించారు. 4 కోట్ల ప్రజలకి ఇళ్లు కట్టించారు. మౌలికంగా అనేక మార్పులు తీసుకొచ్చారని అన్నారు. అలాగే మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఇంకా బీజేపీ నేతలు దేశ అభివృద్ధికి మోడీ పాలన ఎంత కీలకమైందో వివరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం మీద ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని, ఇది దేశ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పేద, అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా మోడీ పాలన ఉందని అన్నారు. రైతులు, యువత, మహిళలు ఈ నాలుగు ప్రధాన విభాగాల అభివృద్ధి కోసమే ప్రతి కార్యక్రమం రూపకల్పన చేశారని అన్నారు. భారతదేశం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, ఇటీవలే 4 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా మారిందని కిషన్ రెడ్డి తెలిపారు. పన్నుల వ్యవస్థలో సమగ్ర మార్పులు చేసి, జీఎస్టీ ద్వారా 'వన్ నేషన్ వన్ ట్యాక్స్' లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. 2014లో 6.91 కోట్ల పన్నులు కట్టే వారు ఉండగా, ఇప్పుడు 15.66 కోట్లకు పెరిగిందని వివరించారు. అలాగే మోడీ ప్రభుత్వం రైతుల కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలుపుతూ.. వ్యవసాయ బడ్జెట్ 25,633 కోట్ల నుంచి 1.33 లక్షల కోట్లకు పెరిగిందని, 82 శాతం వరకు గిట్టుబాటు ధరలు పెరిగినట్లు వెల్లడించారు. 11 కోట్ల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా నేరుగా రైతు అకౌంట్ లోకి నగదు అందిస్తామని అన్నారు. అలాగే ఉగ్రవాదం విషయంలో జీరో టాలరెన్స్ పాలసీ అనుసరిస్తున్నామని చెప్పారు. పఠాన్ కోట్ సర్జికల్ స్ట్రయిక్ పహల్గావ్ దాడి, ఆపరేషన్ సింధూర్ వంటి చర్యలు భారత్ శక్తిని చాటిచెప్పినట్టు- పేర్కొన్నారు. బ్రహ్మోస్, బ్రహ్మాస్త్రం వంటి సామర్థ్యాలు దేశ రక్షణను మరింత బలంగా తీర్చిదిద్దాయని అన్నారు. మరోవైపు దేశంలో అమృత్ భారత్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తుండగా.. 1.46 లక్షల కి.మీ. జాతీయ రహదారులు, 7.7 లక్షల కిమీ గ్రామీణ రహదారులు నిర్మించామని చెప్పారు. రైల్వే బడ్జెట్ 29,056 కోట్ల నుంచి 2.42 లక్షల కోట్లకు పెరిగిందని, 136 వందే భారత్ రైళ్లు ప్రారంభించామని వివరించారు. ఇక ఉడాన్ స్కీం ద్వారా సామాన్యులకూ విమానయానాన్ని అందుబాటులోకి తెచ్చామని, 2014లో 71 విమానాశ్రయాలు ఉండగా.. ఇప్పుడు 159కి పెరిగినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 26 ఆఒఒఃను ఆసుపత్రులు ఇప్పటికే పనిచేస్తుండగా, మరో 15 నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. బేటీ- బచావో - బేటీ- పఢావో, దీన్ దయాళ్ ఉపాధ్యాయ విద్యుత్ యోజన, ఆర్టికల్ 370 రద్దు, 140 శాటిలైట్‌ల ప్రయోగం, చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరటం వంటి చర్యలు మోడీ ప్రభుత్వం సామాజికంగా, శాస్త్రీయంగా దేశాన్ని ముందుకు నడిపించిందని అన్నారు. ఇక తెలంగాణ రాష్ట్రం గురించి మాట్లాడుతూ.. 2014లో లాభాల్లో ఉన్న రాష్ట్రం, మోడీ విధానాలను పాటించకపోవడంతో ఇప్పటికి 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమికి ప్రజలు మంచి విజయాన్ని అందించారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశానికి సుపరిపాలన, ధృడమైన నాయకత్వంతో మంచి పాలన అందిస్తున్నారని ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ కేవలం అభివృద్ధి చెందిన భారత దేశమే కాదు ప్రతి సామాజికవర్గం ఎదుగుదల సాధించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలో దేశాన్ని పాలించగల సత్తా ఉందని ప్రజలు భావించి బీజేపీకి భారీ విజయాన్ని అందించారని చెప్పారు. సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్, సబ్ కా విశ్వాస్‌తో అన్ని లక్ష్యాలని ఛేదించాలనే ఉద్దేశంతో మోదీ పాలన కొనసాగిస్తున్నారని వివరించారు. దేశంలో అవినీతి రహిత పాలన ఉండాలని ప్రజలు భావించి బీజేపీని గెలిపిస్తున్నారని చెప్పుకొచ్చారు పురందేశ్వరి. ఆంధ్రరాష్ట్రంలో గత జగన్ ప్రభుత్వం రాక్షస పాలనతో ప్రజలని ఇబ్బందులకి గురి చేశారని పురందేశ్వరి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలోకి వచ్చాక అభివృద్ధి దిశలో పాలన కొనసాగుతోందని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు అందించటం అలాగే రాజధాని నిర్మాణం కోసం నిధులు కేటాయించారని పురందేశ్వరి పేర్కొన్నారు.

# మరోమారు రాజాసింగ్ హాట్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం కుల సమీకరణ ఆధారంగా బీజేపీ అభ్యర్థిని నిర్ణయించ బోతుందంటూ కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా ఆయన వ్యాఖ్యానించారు. దీంతో జూబ్లీహిల్స్ టికెట్ రెడ్డి సామాజిక వర్గానికేనంటూ పార్టీలో ఓ చర్చ ప్రారంభమైంది. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక ఆరు నెలల తర్వాత ఉంటుందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ముస్లిం ఓట్ బ్యాంకును బీఆర్ఎస్‌కి ఎంఐఎంలు విక్రయించారని ఆయన విమర్శించారు. అయితే రానున్న ఉప ఎన్నికల్లో ముస్లిం ఓటు బ్యాంకును ఎంఐఎం నేతలు.. బీఆర్ఎస్ పార్టీకి అమ్ముతారా? లేక కాంగ్రెస్ పార్టీకి విక్రయిస్తారా? అనేది చూడాలన్నారు.

ఇక బీజేపీ విషయానికి వస్తే.. గతంలో కుల రాజకీయం జరిగిందన్నారు. మరి ప్రస్తుతం కూడా కుల రాజకీయం జరుగుతుందా? లేక పార్టీలోని సీనియర్లకు అవకాశం ఇస్తారా? అనేది చూడాల్సి ఉందని ఎమ్మెల్యే రాజా సింగ్ అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో సోమవారం మరణించారు. ఈ నేపథ్యంలో మరికొన్ని నెలల్లో ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. మరోవైపు ఇటీవల హైదరాబాద్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు ప్రముఖులు సైతం ఇదే కార్యక్రమానికి హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహకరిస్తే.. తెలంగాణ అభివృద్ధి దూసుకుపోతుందన్నారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఆ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ఆయన వ్యంగ్య బాణాలు సంధించారు. కిషన్ రెడ్డికి, ఎమ్మెల్యే రాజాసింగ్ మధ్య అంతర్గతంగా కోల్డ్ వార్ నడుస్తుందంటూ పార్టీలో చర్చ నడుస్తోందనే ఓ ప్రచారం సాగుతోంది.

# బస్ పాస్ ధరల పెంపుపై నిరసన

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడ్డగోలుగా దోచుకుంటోందని.. విద్యార్థులు, ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్‌కు కవితను తరలించడంతో జాగృతి కార్యకర్తలు సైతం భారీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని రకాల బస్ పాస్ ఛార్జీలను టీజీఎస్ఆర్టీసీ పెంచింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌తోపాటు- మెట్రో డీలక్స్ ఛార్జీలనూ పెంచేసింది. మరోవైపు పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బస్ భవన్ ఎదుట మెరుపు ధర్నా చేపట్టారు. ధర్నాకు దిగిన అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు పడాల సతీష్, కడారి స్వామి యాదవ్‌తో పాటు- బీఆర్ఎస్వీ శ్రేణులను, విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సు పాస్ ఛార్జీలు పెంచడం వల్ల పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడుతుంది. ఒక్కో విద్యార్థిపై రూ. 250 నుంచి రూ. 350 వరకు భారం పడుతోంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థులపై ఈ విధమైన భారం ఏదీ విధించలేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, ఒకవైపు బస్సులను పెంచక విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ.. మరోవైపు చార్జీలు పెంచి విద్యార్థులపై రేవంత్ సర్కార్ ఆర్థిక భారాన్ని మోపుతుందని గెల్లు శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు 20 శాతం మేర ఛార్జీలను పెంచడంతో హైదరాబాద్ నగర వాసులపై అధిక భారం పడనుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ బస్ పాస్ ఛార్జీల పెంపుపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పందించారు. బస్ పాస్ ఛార్జీలు పెంచి చాలా కాలమైందని.. ఈ నేపథ్యంలో వాటిని పెంచాల్సి వచ్చిందంటూ వివరణ ఇచ్చారు. బస్ ఛార్జీల పెంపు నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందంటూ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని బస్ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు

# మంత్రులకు శాఖల కేటాయింపులపై కసరత్తు

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్ద విద్యుత్ శాఖ ఉంది. త్వరలో కొన్ని కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు- తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుధీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి

సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటాయించే అంశంపై సమాలోచన జరిగినట్టు- తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ- సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు- తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు- సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు- జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు-.. మంత్రివర్గంలో స్థానం దక్కుతుందని ఆశించి నిరాశ చెందిన వారి ప్రభావమెంత వారిని శాంతింపజేయడం ఎలా అనే అంశాలపై కూడా కేసీ, రేవంత్ రెడ్డి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన వారికి ఈసారి చోటు- కల్పిస్తామనే నమ్మకం కలిగించాలని రేవంత్ రెడ్డికి కేసీ సూచించినట్టు తెలిసింది. అలాగే.. ప్రస్తుతం కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారి వ్యవహారశైలి, పనితీరు తదితర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నట్టు- సమాచారం. ఈ నేపథ్యంలో ఒకరిద్దరి మంత్రుల శాఖల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నట్టు- కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఉత్తమ్‌కు పిలుపు రావడంతో అనుమానలు బలపడుతున్నాయి. ఉత్తమ్ నీటిపారుదలతో పాటు పౌరసరఫరాల శాఖ నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన శాఖల్లో మార్పులు జరగవచ్చని అంటున్నారు.

# బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు అనుకూలం

మొదటి పేజీ తరువాయి

పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దని, తెలంగాణకు వచ్చే పెట్టుబడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి షైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుందని తెలిపారు. తెలంగాణలో షైవా గ్రూప్ భాగస్వామిగా మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. షైవా గ్రూప్, టారానిస్ క్యాపిటల్ కలిపి రాష్ట్రంలో రూ. 2,125 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బయోసైన్స్, కృత్రిమ మేధలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల ప్రదేశమన్నారు. తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం

కృషి చేస్తోందన్నారు. ఏడాదిన్నరలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో లక్షకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఏడాదిన్నరలో రూ. 3లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టు-బడిదారులు ముందుకు వస్తున్నారన్నారు. యువత మన ఆస్తి.. వారిలో నైపుణ్యాలు నింపేందుకు స్కిల్ యూనివర్సిటీ- ఏర్పాటు- చేశామని తెలిపారు. రాష్ట్రం అవకాశాల గని.. ఆవిష్కరణలకు, అవకాశాలకు, ప్రతిభకు కేంద్రమని పేర్కొన్నారు. అంతర్జాతీయ భాగస్వాములను రాష్ట్రం ఆకర్షిస్తోందన్నారు. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు కుదిరాయని, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించిందని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. 'తెలంగాణ ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు మెరుగైన అవకాశాలు కల్పిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలు చూసి శైవ గ్రూప్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పుకుంది. 13 వందల కోట్లతో బయోటెక్ సంస్థ పెట్టుబడులు పెడుతున్నారు. ఐదు సంస్థల్లో 2100 కోట్లు-, 5 వేల మందికి ఉపాధి కలగనుంది. సాంకేతిక పరమైన కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం పెట్టుబడి దారులకు సహకారం అందిస్తుంది. 18 నెలల్లో 3 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలు, లక్ష మందికి తెలంగాణ యువతకు ఉపాధి లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగు నుంచే విమర్శలు చేస్తున్నారు. మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల్లో చూపిస్తున్నాం' అని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'పెట్టుబడులు రావడం లేదు, కంపెనీలు పోతున్నాయి అనే విమర్శలకు ఇది కౌంటర్ అన్నారు. తెలంగాణకు వచ్చే పెట్టు-బడులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదా?. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు మరింత ఉపాధి లభించనుంది. తెలంగాణ ప్రతిభకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారింది. పెట్టుబడుల విషయంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేయొద్దు. పరిశ్రమల వాతావరణాన్ని డిస్టర్బ్ చేయొద్దు. భవిషత్తులో పెద్ద సంఖ్యలో పెట్టు-బడులు తీసుకొస్తాం' అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు.

# ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి







**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :** అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి అధ్యక్షతన ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫిజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఈరోజు నిజామాబాద్ నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ ఎఫ్ ఐ, ఏఐపిఎస్ యు, పి డి ఎస్ యు,విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం నాయక్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం 20% నుంచి 30% వరకు ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుట జలగల్లాక పీడిస్తున్నారని అదేవిధంగా ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే బుక్స్, స్కూల్ డ్రెస్సు, పేరు తోటి అనేక డబ్బులు దండుకుంటూ విద్యాశాఖ అధికారులు కనీసం చర్యలు తీసుకోకుండా ఉండటం అనేది సిగ్గుచేటని ఆయన అన్నారు. దాంతోపాటు జీవో నెంబర్ 42, 91 ప్రకారం ఫీజులు పెంచాలంటే జిల్లా కలెక్టర్ తోటి అదే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు పేరెంట్స్ అభిప్రాయాలు తీసుకొని కమిటీ ద్వారా నిర్ణయించి ఫీజులు పెంచాలి కానీ ఎప్పుడు కూడా కమిటీ ద్వారా ఫీజులు నిర్ణయించి పెంచినట్టు ఎప్పుడు దాఖలు లేవు వెంటనే విద్యాశాఖ అధికారులు ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలుచేసి ఫీజులు దోపిడీని అరికట్టాలని దాంతోపాటు ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో జీవో నెంబర్ ఒకటి ప్రకారం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఫీజులు పెంచడం చట్టాన్ని అమలు చేయకపోతే మాత్రం రాబోయే కాలంలో రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా కూడా ఆందోళన నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ఏఐపిఎస్ యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ ,ఎస్ఎఫ్ఐ నిజాంబాద్ జిల్లా కార్యదర్శి విగ్నేష్, పిడిఎస్యు నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, పిడిఎస్యు నిజామాబాద్ జిల్లా కార్యదర్శి గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లానిజామాబాద్ సహాయ కార్యదర్శి కుషాల్,నాయకులు టోకు, సంతోష్, రమేష్, మోతి, దినేష్ ,చరణ్ మరియు ఇతర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అభయ హస్తం కాలనీ ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

**- గాలివానతో కూలీన ఇండ్లను బాధితుల పరమర్శించారు**

**- కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్, అభయ హస్తం కాలనీ అధ్యక్షులు కృష్ణ**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :** నిజామాబాద్ నగరంలో నిన్న రాత్రి గాలివానకు ప్రజలు అనేక అవస్థలు పడ్డారు, ఇందులో భాగంగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు మల్యాల గోవర్ధన్, అభయ హస్తం కాలనీ అధ్యక్షులు ద్యారంగుల కృష్ణ ల ఆధ్వర్యంలో పరమర్శించారు,
అభయ కాలనీలో గాలివానకు అనేక నిరుపేదల ఇండ్లు నేల మట్టం కావడంతో ప్రజలు నిరాశ్రాయులు అయ్యారు, వారిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు, గతంలో అభయ హస్తం కాలనీ అభివృద్ధి కోసం మహ్మద్ షబ్బీర్ అలీ గారు 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేశారని, అదేవిధంగా ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి మోడల్ కాలనీగా మారుస్తామని హామీ ఇచ్చారు, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని టీపీసీసీఅధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విన్నవించడం జరిగిందని అన్నారు,
గాలి వానతో జరిగిన నష్టాన్ని నేతల దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలాగా కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, నర్సింగ్, ఆకాష్, షేరు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులతో కూడిన వర్షం పలుచోట్ల నేలకొరిగిన చెట్లు





**- బీభత్సం సృష్టించిన ఈదురు గాలులు**

**- పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య,పనులను సహాయక చర్యల చేపట్టారు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :** నిజామాబాద్ నగరంలో పలు ప్రాంతాలలో సోమవారం రాత్రి భారీ ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. అనేక ప్రాంతాల్లో భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్ల మీద పడడం తో రవాణా వ్యవస్థ స్తంభించి పోయింది. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలిగింది అనేక ప్రాంతాలు రాత్రంతా అంధకారం లో ఉండి పోయాయి.
రోడ్ల మీద పడిన చెట్లు స్తంబాలు లను తొలగించడానికి పోలీసులు రంగంలోకిదిగారు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు.
ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూడాలని, జెసిబి ల సహాయం తో చెట్లను తొలగించారు పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య,స్వయంగా ఈ పనులను పర్యవేక్షించారు.
పలు ప్రాంతాలలో తిరిగారు ఇలాంటి ఆపత్కాల పరిస్థితులలో ప్రజలు వెంటనే పోలీస్ లకు సమాచారం అందిస్తే అవసరం అయిన సహాయం అందిస్తాము అని, ప్రజల భద్రత సౌకర్యం కోసం పోలీసులు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.
నగరంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్థంబాలు నేలకు పడ్డాయి. దీనితో విద్యుత్ తీగలు రోడ్ల మీద పడడం తో ప్రజలు భయకంపితులయ్యారు.
విద్యుత్ సిబ్బంది రాత్రంతా రోడ్ల మీదే ఉండి సహాయక చర్యల్లో నిమగ్నం అయ్యారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పొగ సిబ్బంది వెంటనే మరమ్మతు లుచేసి సరఫరా పునరుద్ధరించారు. ఒక్క నగరంలోనే 17 చోట్ల విద్యుత్ స్తంబాలు విరిగి పోయాయి.

# స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క సేవలు చిరస్మరణీయం

**- మెట్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్**



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 10 :** మెట్పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి దేవి అద్భుతమైన నాయకురాలని, వారి పోరాటం ఆమె సాధించిన విజయాలు మన ప్రాంతాలలో చెరగని ముద్ర వేశాయని మెట్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్ అన్నారు. మంగళవారం మెట్పల్లిలోని కొమిరెడ్డి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన జ్యోతక్క జయంతి సందర్భంగా స్థానిక పార్టీ నాయకుల మధ్య ఆమె చిత్రపటానికి పూలు జల్లి నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఆమె శాసన సభ్యురాలుగా కొనసాగుతున్న సమయంలో చట్టసభలో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్ తో జ్యోతక్క అనేక ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్నారని, మహిళ నాయకురాలిగా స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడిపిన కొమిరెడ్డి జ్యోతక్క. తెలంగాణ రాష్ట్ర రాజకీయ రంగంలో చైతన్యవంతమైన నాయకురాలిగా కీర్తి ప్రతిష్టలు గడించారని, ఆమె సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ మాజీ మండల అధ్యక్షులు కటకం గంగారెడ్డి, కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ తేజ, టి పి సి సి ఫిషరీస్ రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్‌బీ పట్టణ ఎస్సీ సెల్ మాజీ టౌన్ ప్రెసిడెంట్ బర్ల వంశీ, ఓయూ జేఏసీ పార్టీ నాయకులు కాజా అజీమ్, టిపిసిసి ఫిషరీస్ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు కంతి హరికుమార్, నాయకులు డోనోజు వెంకటేష్, తాండ్ర నర్సయ్య, తోట్ల లక్ష్మణ్, సింగని మారుతి, పొన్నాల ఎల్లేష్, పొట్ట గోపి, రాజేష్, రమేష్, సన్నీ, బండి నాగరాజు, విజయ్, శివ, అల్లె నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# అన్నను గాయపరిచిన తమ్ముడికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు10వేలు జరిమాన

**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 10 :** వివరాలోనికి మెట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూరు గ్రామానికి చెందిన మల్లయ్యకు ఐదుగురు కుమారులు. ఆత్మకూరు గ్రామ శివారులో మల్లయ్య కు ఒక ఎకరం భూమి ఉండగా ఈ యొక్క భూమిని 5 గురు కొడుకులు సమానంగా పంచుకునే క్రమంలో చిన్న కొడుకు బీరయ్య వినకుండా గొడవలు సృష్టించేవాడు. ఈ క్రమంలో బీరయ్యకు సంబంధించిన 8 గుంటల భూమిని వదిలేసి మిగతా భూమిని ఆ యొక్క నలుగురు కుమారులు ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరం వ్యవసాయం చేసుకొన సాగారు. తేదీ 31-08-2019న బీరయ్య తన ట్రాక్టర్ తో మిగతావారు చేసుకుంటున్న పంటను చెరపడానికి ప్రయత్నించగా దీనికి అడ్డుగా వెళ్లిన తన అన్న అయిన ముత్తయ్య ను పార తో కొట్టగా అతని కుడి భుజంపై గాయం కావడం జరిగింది. ఇట్టి విషయం గురించి అతని రెండవ తమ్ముడు నడిపి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ నిందితుడు అయిన బీరయ్య పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది.అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ తమ వాదనలు వినిపించగా సాక్షులను విచారించిన న్యాయ మూర్తి అరుణ్ కుమార్,జెఎఫ్ సీఎం మెట్ పల్లి నిందితుడు బీరయ్యకి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 10 వేలు జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.ఈ కేసులో పకడ్బందీగా విచారణ జరిపి సాక్ష్యాదారాలను, సాక్ష్యులను తగు రీతిలో కోర్టులో ప్రవేశ పెట్టి ,ఇట్టి శిక్ష పడటనికి కృషిచేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్ కుమార్ అదేవిధంగా పోలీస్ శాఖ తరఫున ఈ నేరపరిశోధన అధికారులు ఎస్ఐ కిరణ్ కుమార్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్స్ ఎస్ఐ శ్రీకాంత్, కిరణ్ కుమార్, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ సునీల్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

# ఉమేష్ చంద్ర నగర్ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలి

**- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపందా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్ రెడ్డి**



**పినపాక (మన వెలుగు) జూన్ 10 :** పినపాక మండలం లోని, టీ కొత్తగూడెం గ్రామపంచాయతీ, ఉమేష్ చంద్ర నగర్ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపందా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాపంథా ప్రతినిధి బృందం ఉమేష్ చంద్ర నగర్ గ్రామాన్ని సందర్శించి, సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమేష్ చంద్ర నగర్ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ఆపద సమయంలో ప్రయాణాలు కొనసాగించాలంటే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, అనేక సందర్భాలలో ఈ గ్రామానికి చెందిన ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు హాస్పిటల్ కి వెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడ్డామని, ఇటీవల గర్భిణీ స్త్రీ ని హాస్పిటల్ కి తీసుకువెళ్లాలంటే రహదారి లేక, వాహనాలు వచ్చే పరిస్థితి లేక మంచానికి జట్టి కట్టి రెడ్డిగూడెం వరకు మనుషులతో మోసుకెళ్లి అక్కడి నుండి వాహనంలో హాస్పిటల్ కి తీసుకెళ్లడం జరిగిందని, రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని మాకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారని అన్నారు. వారి కోరిక న్యాయమైనదే కనుక సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఒకపక్క చంద్రమండలానికి పోయి వస్తున్నా, మరోపక్క ఏజెన్సీలోని అనేక గ్రామాలకు రహదారులు, విద్యా, వైద్యం, విద్యుత్తు లాంటి మౌలిక సదుపాయాలు నేటికీ కల్పించకపోవడం దురదృష్టకరమని అన్నారు. పట్టణ ప్రాంతాలలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామని చెప్పే పాలకులు, ఏజెన్సీ గ్రామాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమం





**బోథ్ (మన వెలుగు) జూన్ 10 :** సిరికొండ మండల కేంద్రంలోని సిరికొండ గ్రామంలో 38 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అర్హులు కాగా మంగళవారం సిరికొండ గ్రామానికి చెందిన పలువురి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రోసిడింగ్ కాపీలు మరియు భూమి పూజ కార్యక్రమాన్ని మండల్ కమిటీ మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి చేశారు ఇంచార్జ్ మంత్రివర్యులు సీతక్క మరియు బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ సహకారంతో సిరికొండ గ్రామానికి 38 ఇందిరమ్మ ఇల్లు మంజూరైనాయని ఇందిరమ్మ కమిటీ సభ్యులు తెలిపారు మంగళవారం సిరికొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు అధికారులు కలిసి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామపంచాయతీ కార్యదర్శి, కారోబారీ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బస్తి దావకణలో ఖాళీగా ఉన్న వైద్య అధికారులు స్టాఫ్ నర్సులు

**- నియామక పత్రాలు అందజేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :** నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోనీ బస్తి దావఖానలలో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు,స్టాఫ్ నర్స్ అభ్యర్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. ఇద్దరు వైద్యాధికారులకు,ఐదుగురు స్టాఫ్ నర్స్ లకు ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని బస్తీలలో,మురికివాడల్లో పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన బస్తి దావకానల్లో సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజేశ్వర్, పాల్గొన్నారు.

# షాద్ నగర్ - జై సంవిధాన్ కార్యక్రమం

**రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, దేశ సమగ్రత కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది**

**దేశ సమగ్రతకు ప్రధాని మోదీ, అమిత్ షా తూట్లు పొడుస్తున్నారు**

పాకిస్థాన్‌పై యుద్ధం అంటూ ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ ట్రంప్ చెప్పగానే తోక ముడిచారు

బి దేశ విచ్ఛిన్న శక్తుల కుట్రలను తిప్పికొట్టేందుకు "జై బాపు, జై భీమ్,జై సంవిధాన్" కార్యక్రమాలు

షాద్ నగర్: రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, దేశ సమగ్రత కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్.

బీజేపీ దేశ విభజన రాజకీయాలను, విచ్ఛిన్న శక్తులను ఎదిరించేందుకు "జై బాపు, జై భీమ్,జై సంవిధాన్" కార్యక్రమాలను గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్ధృతంగా చేపడతామని హెచ్చరించారు.మంగళవారం షాద్ నగర్ లో స్థానిక ఎమ్మెల్యే వీర్ల శంకర్ ఆధ్వర్యంలో చేపట్టిన "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమంలో భాగంగా టీపిసిసి చీఫ్ ప్రసంగించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించారని గుర్తు చేశారు.బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని, మనుస్మృతిని అమలు చేయాలని కుటిలంగా ప్రయత్నిస్తోందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా గల్లి నుండి ఢిల్లీ వరకు "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.ప్రధాని మోదీ, అమిత్ షా దేశ సమగ్రతకు, అఖండతకు తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని మహేష్ గౌడ్ మండిపడ్డారు.

అంతకుముందు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కార్యాలయం నుంచి ఈడెన్ గార్డెన్స్ వరకు "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ర్యాలీ జరిగింది. భారీ జనసందోహంతో ర్యాలీ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో స్థానిక ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

అనంతరం ఈడెన్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన సభలో టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు

అధికారమే పరమావధిగా, అధికారం లేకుంటే బతకలేమనే విధంగా బీజేపీ నాయకుల తీరు జీర్ణించుకోలేని విధంగా ఉంది.రాజకీయ స్వలాభం కోసం బీజేపీ నాయకులు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు. ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశ విచ్ఛిన్న శక్తులను తిప్పికొట్టేందుకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" కార్యక్రమం చేపడుతున్నాం. పదేళ్ల కేంద్ర పాలనలో బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెప్పుకోలేని స్థితిలో ఉంది.400 సీట్లు వస్తాయని ప్రగల్భాలు పలికిన బీజేపీ నాయకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు, అయినా వారిలో మార్పు రాలేదు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశాన్ని భౌగోళికంగా, సామాజికంగా, రాజకీయంగా అర్థం చేసుకున్నారు.

దేశంలో అసమానతలు, ఆర్థిక వ్యత్యాసాలను రూపుమాపేందుకు రాహుల్ గాంధీ కుల గణనకు శ్రీకారం చుట్టారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కుల గణన పూర్తి చేసి, ఎవరు ఎంత నిష్పత్తిలో ఉన్నారో స్పష్టం చేశారు. ఖర్గే, రాహుల్ గాంధీ సూచనల మేరకు ఒక బీసీ, ఇద్దరు ఎస్సీలకు కేబినెట్ లో చోటు ఎస్టీకి డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టాం.టిపిసిసి కార్యవర్గంలో 70% శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు, మహిళలకు కేటాయించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం.

పాకిస్థాన్‌పై యుద్ధం అంటూ ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ, ట్రంప్ చెప్పగానే తోక ముడిచారు.92 వేల పాక్ సైనికులను ముక్కును నేలరాసిన చరిత్ర అపర ఖాళీమాత ఇందిరా గాంధీది. ప్రధాని పదవిపై మోదీకి యావ ఉంది కానీ, దేశంపై ప్రేమ లేదు.పాకిస్థాన్‌పై యుద్ధంలో దేశం సాధించింది ఏంటి? కోల్పోయింది ఏంటి? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తోంది.

# టీ పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమితులైన తోపాజి అనంత కిషన్

**... రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమితులైన అనంత కిషన్ ను సన్మానించిన జగ్గారెడ్డి**



టీ పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా సంగారెడ్డి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోపాజి. అనంత కిషన్ నియమించబడ్డారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి తోపాజి అనంత కిషన్ కు అభినందనలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు జార్జ్ కూన సంతోష్, షఫీ హఫీజ్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీహరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ కాలనీ సమస్యలు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి: కమీషనర్ ఆర్.వి.కర్ణన్



అత్తాపూర్ లక్ష్మీ కాలనీ సమస్యలు య ు ు ద్ధ ప్రా తి ప ది క న పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జోనల్ కమీషనర్ వెంకన్న తో కలిసి కమీషనర్ అత్తాపూర్ లక్ష్మీ నగర్ కాలనీ లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కమీషనర్ ను కోరారు.

కాలనీలో ముఖ్యంగా దోమల సమస్య, మెయిన్ రోడ్డు నుండి కాలనీ వరకు రోడ్డు వెడల్పు, కాలనీ చుట్టూ ఉన్న మూసి పరివాహక స్థలంలో ప్రైవేటు వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు డంపు చేస్తున్నారని, అందువలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆర్.డబ్ల్యూ.ఎస్ ప్రతినిధులు కమిషనర్ కు వివరించడం తో అక్కడున్న జోనల్, డిప్యూటీ కమీషనర్ లను ఆదేశిస్తూ వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నివారణకు ఎంటమాలజి విభాగం ద్వారా చర్యలు తీసుకుంటామని కమీషనర్ తెలిపారు. అదే విధంగా సి అండ్ డి డంప్ ను నివారణకు విజిలెన్స్ అధికారుల తో చర్యలు తీసుకుంటామని అన్నారు. అక్రమంగా డంప్ చేయకుండా వాహనాల పై కేసు పెట్టి చర్యలు తీసుకుంటామని కమీషనర్ వారికి వివరించారు. వీధి దీపాల సమస్య త్వరలో తీర్చడానికి చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ వివరించారు. ఇట్టి సమస్య శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు కమిషనర్ వివరించారు. సింగిల్ ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని కమీషనర్ కోరారు. అందుకు వీధి వ్యాపారులు షాపు యజమానులు సింగిల్ ప్లాస్టిక్ వాడకం పై కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండి నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరి పై బాధ్యత ఉందని, వీధి కుక్కల బెడదను అరికట్టుటకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఆర్ డబ్లు ఏ సభ్యులు కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్యంగా మూసి రివర్ బెడ్ లో రాత్రి సమయంలో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త, ఆహార వ్యర్థాలు అక్రమంగా డంప్ చేస్తున్నారని వాటిని నియంత్రణ చేయకపోతే వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కమిషనర్ ను కాలనీ ప్రతినిధులు కోరారు

కమీషనర్ వెంట జోనల్ కమీషనర్ వెంకన్న, డిప్యూటీ కమీషనర్ రవి కుమార్, టౌన్ ప్లానింగ్ ఏ సి పి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సంతలో సరస్వతి

అక్షరాభ్యాసానికి లక్షల్లో ఆరగించి
అరకొరగా సదువు చెప్పి
"నిరుద్యోగ"పత్రాలను అప్పచెప్పి
గురు బ్రాహ్మ గురు విష్ణని
గప్పాలు కొట్టి మరి
ఆ బ్రాహ్మ జీత భత్యాలను దోపిడీల రాత రాసే
దొంగ యాజమాన్యాలు
శాస్త్రీయత కరువైన పుక్కిటి పురాణాల్ని చేర్చి
చెద పట్టిన చరిత్రను అనువుగా సవరించి
నూతన విద్య అంటూ
అజ్ఞాన నూతిలోకి విద్యార్థిని
నెట్టేసి
పైత్యమెక్కి ప్రవర్తించే పలు రాజకీయ పార్టీలు
ప్రభుత్వాల బడులంటే
పురుగన్నాల మడులేనని
మరుగుదొడ్డి వృదలేనని
పేద బిడ్డ పరిగెడుతూ
నీకెంతో దూరమయ్యే
తల్లీ సరస్వతీ దేవి
నీకు గుడిలోన దండమెట్టి
విద్యా వీధిలోన బేరమెట్టే
నా దేశం?

నేపా.సంతోష్ అచ్యుత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజి ప్రతిభ పురస్కార గ్రహీత.



# పెంచిన బస్ పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలి

**- ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**- జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :**



రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో కోట గల్లి లోని నీలం రామచంద్ర భవన్లో నిర్వహించడం జరిగింది .

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిసి బస్ పాస్ చార్జీలు 1150 నుండి 1400 ,మెట్రో ఎక్స్ ప్రెస్ లో 1300 నుండి 1600 వరకు దాదాపు 20 శాతం పెంచడం జరిగింది , పెంపు పేద మధ్యతరగతి విద్యార్థులకు ఆర్థిక భారం పడుతుందని, స్కూలు కాలేజీలు ప్రారంభమవుతున్న సందర్భంలో ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదని, ఒకవైపు ఫ్రీ బస్సు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ మరొకవైపు పేద విద్యార్థుల పైన వసూలు చేయడం దుర్మార్గమని అన్నారు. వెంటనే పెంచిన బస్ పాస్ లను బస్సులను తగ్గించాలని డిమాండ్ చేశారు.12 నుండి ప్రభుత్వ పాఠశాల ప్రారంభమవుతున్న దృష్ట మౌలిక సదుపాయాలు కల్పించాలనీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నగర పి డి ఎస్ యూ నాయకులు మనోజ్,నిఖిల్,ముక్తశ్రీ,దుర్గాప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం.

**ములుగు ప్రతినిధి (మన వెలుగు ) జూన్ 10 :**

శంకరాజ్ పల్లి ఏటూరు నాగారం మండలం లో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో డి. సంజీవరావు జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో ఉద్యాన పంటల సాగు అంతర్ పంటల మిశ్రమ పంటల సాగు ఆవశ్యకత ఆయిల్ పామ్ తోటలకు రాయితీ వివరాలు పోడుపట్టాలు కలిగిన ఎస్టీ రైతులకు ఇందిర సౌర గిరి జలవికాసం పథకం దాని రాయితీ గురించి తెలియజేయడం జరిగినది. ఆయిల్ పామ్ ఎకరానికి రాయితీ మొక్కలపై రూపాయలు 11,500/-అంతర్ పంటలకు యాజమాన్యంపై 16,800/- రూపాయలు నాలుగు సంవత్సరాలకు మరియు చిందు సేద్య పరికరాలపై రూపాయలు 22,518/- మొత్తంగా ఎకరానికి 50,918/- రూపాయలు రాయితీ ఈ ప్రభుత్వం అందిస్తుంది. డ్రిప్ పై రాయితీ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% చిన్న సన్నకారు రైతులకు 90% ఇతర రైతులకు 80% ఉంటుంది. సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి పథకంలో మామిడి అరటి బొప్పాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలకు 50 శాతం రాయితీ పందిళ్ళపై తీగజాతి కూరగాయలను సాగు చేయవచ్చును. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం డివిజన్ ఉద్యాన అధికారి కోపిరి లావణ్య ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిది దుగ్గి అఖిల్ ఫినోలెక్స్ డిప్ కంపెనీ ప్రతినిది రోహిత్ రైతులు విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, జాడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ దివ్యాంగుల సహాయం కోసం దరఖాస్తుల ఆహ్వానం

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :**

నిజామాబాద్ జిల్లాలోని దివ్యాంగులకు తెలియజేయునదేమనగా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారము జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖ,తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2024-2025 సంవత్సరమునకు గాను శారీరక వైకల్యం గల వారికి, బదిరులకు, అందులకు, మానసిక దివ్యాంగుల సహాయార్థం రెట్రోఫిట్టేడ్ మోటరైజ్డ్ వెహికల్, బ్యాటరి వీల్ చైర్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో, హైబ్రీడ్ వీల్ చైర్, ల్యాప్ టాప్, ట్యాబ్, 5జి స్మార్ట్ ఫోన్లు, మూడు చక్రాల రిక్షా, సాదారణ వీల్ చైర్, చంక కర్రలు, చేతి కర్రలు మొదలగు సహాయ ఉపకరణములను ఉచితముగా పంపిణీ చేయుటకు నిర్ణయించడమైనది. కావున నిజామాబాద్ జిల్లాలోని దివ్యాంగ సోదర సోదరీమణులు,ఎస్.ఎస్.సి., ఇంటర్మీడియట్ ,ఆ పై ఉన్నత చదువులు చదువుచున్న అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని %ఫ్ట్రజూం:∹//ంశీఎఎఎం.ఎస్తస్త.స్త్రశీజ.ఱఅ%/ వెబ్ సైట్ నందు తేది: 07-06-2025 నుండి తేది: 18-06-2025 లోపు సంబందిత అన్ని ధ్రువపత్రములతో దరఖాస్తు చేసుకొని సంబంధిత దరఖాస్తు ఫారమును జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, రూం.17, న్యూ కలెక్టరేట్, నిజామాబాద్ నందు సమర్పించినచొ అట్టి దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి అర్హతగల దివ్యాంగులను/ విద్యార్థులను ఎంపిక చేసి సదరు జాబితాను ఉన్నత కార్యాలయమునకు పంపించిన తరువాత నియమ నిబందనల ప్రకారం అర్హులైన దివ్యాంగులకు/ దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణములను ఉచితముగా పంపిణీ చేయబడును.ఇతరా వివరాలకై జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, రూం. 17, న్యూ కలెక్టరేట్, నిజామాబాద్ ని అన్ని కార్యాలయ పనివేళలో నేరుగా గాని లేదా ఫోను సంఖ్య. 08462-251690 ద్వారా గానీ సంప్రదించగలరని తెలియజేయడమైనది.

# నగరంలో యువకుడి దారుణ హత్య

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10:**



హైదరాబాద్ రోడ్ నిజామాబాద్ నగర శివారులోని పాంగ్రా వద్ద యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. సుమారు 35 సంవత్సరాల వయస్సు గల యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు ముఖంపై బలమైన ఆయుధంతో కొట్టి హత్య చేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారంతో నగర పోలీసులు అక్కడ చేరుకొని దర్యాప్తు చేపట్టారు. యువకుడి వివరాలు తెలిస్తే గాని హత్యగల కారణాలు తెలిసే అవకాశం లేదని పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని నిజామాబాద్ నగర సీఐ శ్రీనివాసరాజు, 4వ టౌన్ ఎస్ఐఐ శ్రీకాంత్ లు పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పాంగ్ర వద్ద గల కల్లుబట్టిలో సోమవారం రాత్రి ఏమైనా గొడవ జరిగి ఉంటుందా అని ఆరా తీస్తున్నారు.

# రేకుల షెడ్డు కూలి విద్యుత్ లైన్ మెన్ మృతి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :**



నిజామాబాద్ నగరంలోని (ఆర్య నగర్ )సంజీవరెడ్డి నగర్ లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం రాత్రి భారీ ఈదురు గాలులతో వర్షం పడడంతో యాదగిరి బాగు వద్దనున్న కల్లు కాంపౌండ్ రేకుల షెడ్డు లోపల కూర్చుని ఉండగా పైన చెట్టు కూలడంతో శ్రీనివాస్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని నాలుగవ టౌన్ ఎస్ ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతుడు విద్యుత్ శాఖలో లైన్మెన్ గా పనిచేస్తున్నాడన్నారు.

# బోథ్ నియోజకవర్గ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**- సమస్య ఉంటే సంప్రదించండి 24 గంటలు అందుబాటులో ఉంటా ఎమ్మెల్యే**

**బోథ్ (మన వెలుగు) జూన్ 10 :**



వాతావరణ శాఖ అధికారులు సూచన మేరకు జిల్లాలో రానున్న 2 3 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బోథ్ నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మంగళవారం సూచించారు. ఈదురుగాలులతో కూడిన భారీ వర్ష సూచన ఉంది కాబట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు చేరుకోవాలని అవసరం అయితే తప్ప ఎవరూ బయటికి రావొద్దని ఇలాంటి సమయాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఎక్కడ సమస్య ఉన్న ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ప్రజల కొరకు తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు.

# విద్యార్థులు ప్రగతిశీల భావాలు పెంపొందించుకోవాలి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 10 :**

నిజామాబాద్ నగరంలోని పి డి ఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కోటగల్లి ఎన్.ఆర్.భవన్లో జీవ పరిణామం అనే అంశంపై క్లాసు నిర్వహించారు డాక్టర్ కర్క గణేష్ అధ్యక్షత వహించగా, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు క్లాసు బోధించడం జరిగింది. ఈసందర్భంగా నర్ర రామారావు మాట్లాడుతూ, రాజకీయ అంశాలతో పాటు చరిత్ర, సైన్సు విషయాలను కూడా నేర్చుకోనే దృక్పథాన్ని కలిగిన వాళు ప్రగతిశీల విద్యార్థులని అన్నారు. మనువాద శక్తులు మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల్ని మతం పేరుతో విడదీస్తూ, పీడిస్తున్న ప్రస్తుత తరుణంలో, ప్రజల్ని అప్రమత్తం చేయడంలో ప్రగతిశీల శక్తులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. అందుకోసం తరగతులు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సైన్సు పట్ల, చరిత్ర పట్ల సమకాలీన రాజకీయాల పట్ల ప్రజల్ని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సి.ఎల్.సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ జిల్లా నాయకులు మురళి, మాస్ లైన్ డివిజన్ నాయకులు నారాయణ,మోహన్ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సంధ్యారాణి, పి.డి.ఎస్.యు. నాయకులు నసిర్,నాగేష్, సృజన్, సంతోష్,సునీల్, సాయి,కార్తీక్,అరవింద్, వైష్ణవి,లిఖిత, అక్షయ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.





## చిన్నారుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు

## బసవతారకం ఆస్పత్రిలో కేక్ కట్ చేసిన బాలకృష్ణ

ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది, చిన్నారుల సమక్షంలో బాలకృష్ణ కేక్ కట్ చేశారు. చిన్నారులకు ఈ సందర్భంగా ఆయన బహుమతులను అందజేశారు. ఎన్టీఆర్ దంపతుల విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసు కేవలం ఒక నంబర్ మాత్రమేన్నారు. బాలకృష్ణ అంటే ఏంటో ఇక నుంచి చూపిస్తానని అన్నారు. నా దృష్టిలో నంబర్ పెద్ద విషయం కాదు. నా వయసు అందరికీ తెలిసిందే. తల్లిదండ్రుల దీవెనలతో 64 ఏళ్లు పూర్తి చేసుకున్నా. మా నాన్న కోరిక మేరకు ఒకసారి మెడిసిన్ ఎంట్రెన్స్ రాశాను. మెడిసిన్ చదవలేదు కానీ.. సినిమాల్లో డాక్టర్ పాత్రలు చేశాను. 15 ఏళ్ల క్రితం బసవతారకం ఆసుపత్రికి ఛైర్మన్ అయ్యాను. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందించేలా కృషి చేస్తున్నాం. బాలకృష్ణ అంటే ఏంటో ఇక నుంచి చూపిస్తాను. నాకు చాలా పొగరని అందరూ అనుకుంటారు.. అవును నన్ను చూసుకొనే నాకు పొగరు. బిరుదులకు నేను అలంకారమేమో గానీ.. బిరుదులు నాకు అలంకారం కాదు. బిరుదులు వస్తుంటాయి.. కానీ మన పని మనం చేసుకుంటూ పోవాలని బాలకృష్ణ అన్నారు. ఇకపోతే బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు విషెస్ తెలిపారు. అభిమానుల కోసం పుట్టినరోజు కానుకగా ఆయన నటిస్తోన్న 'అఖండ 2' నుంచి పవర్‌ఫుల్ టీజర్‌ను చిత్రబృందం పంచుకుంది. ప్రస్తుతం అది భారీ వ్యూస్‌తో సోషల్ మీడియాలో – ట్రెండింగ్‌లో ఉంది. సెప్టెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.

## మాల్దీవుల బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా



పర్యాటకులకి మాల్దీవ్స్ ఎంతటి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇస్తుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నీలి రంగు సముద్రం చూస్తుంటేనే మనసు పులకరించిపోతుంది. అయితే మాల్దీవ్స్ జీవితంలో ఒక్కసారైన చూడాలని చాలా మందికి కల ఉంటుంది. ఇప్పుడు మాల్దీవులకి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్ ఎంపికయింది. మాల్దీవులను ప్రముఖ పర్యాటక గమ్యంగా పరిచయం చేయడంలో భాగంగా కత్రినాని అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్టు మాల్దీవుల టూరిజం ప్రమోషన్ సంస్థ అయిన మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ తాజాగా ప్రకటించింది. కత్రినా కైఫ్ రాయబారిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. మాల్దీవులు అనేవి సహజసిద్ధమైన అందం, ఎంతో ప్రశాంతంగా ఉండే ప్రదేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులని పెంచేందుకు, వారికి అత్యుత్తమ అనుభవాలను అందించేందుకు నా వంతు కృషి చేస్తానని కత్రినా స్పష్టం చేశారు. మరోవైపు, మాల్దీవ్స్ రాజకీయంగా కూడా భారత్ సంబంధాలు మెరుగుపరచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు- తెలుస్తుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముఇజ్జు ఇచ్చిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన , భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై నెలలో మాల్దీవులకు వెళ్లే అవకాశముందంటూ నెట్టింట ప్రచారం జరుగుతుంది. ఇదే నిజమైతే ముఇజ్జు అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ మొదటి పర్యటన అవుతుంది. కత్రినా -కై-ఫ్ గ్లోబల్ అంబాసడర్‌గా, మరోవైపు ప్రధాని మోదీ పర్యటన ..ఈ రెండు సంఘటనలూ మాల్దీవులను ఒక ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా బలోపేతం చేయడం ఖాయం అని నెటిజన్స్ అంటున్నారు.

## నేనేం దెయ్యాన్ని కాదు.. ప్రెగ్నెన్సీ రూమర్స్‌పై స్పందించిన కెనీషా



నటుడు జయం రవి , గాయని కెనీషా రిలేషన్‌లో ఉన్నట్లు ఎంతోకాలంగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే వీరిపై ఎన్నో రూమర్స్ వైరల్ అయ్యాయి. తాజాగా ఆమెకు సంబంధించిన మరో వార్త నెట్టింట ప్రచారమవుతోంది. ఆమె గర్భిణి అంటూ కొన్ని రోజులుగా రూమర్స్ వస్తున్నాయి. వాటిపై కెనీషా మరోసారి స్పందించారు. ఒక గాసిప్ మరో గాసిప్‌నకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు."నేనేం దేవదూతను కాదు. అలాగని దెయ్యాన్ని కూడా కాదు. సోషల్ మీడియాలో నాపై ఇలాంటివి ఒకదాని తర్వాత ఒకటి పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఒక గాసిప్ మరోదానికి దారితీస్తోంది. అన్నిటికీ కాలమే పరిష్కారం చూపుతుంది. వీటికి నేను కూడా సమాధానం చెప్పగలను. కానీ, నేను మాట్లాడకూడదని నిర్ణయించుకున్నాను" అని అన్నారు. ఒక పాట చిత్రీకరణ సమయంలో కెనీషా ఫొటోను ఉద్దేశిస్తూ కొందరు ఈ రూమర్స్ సృష్టించారు.భార్య ఆర్తి నుంచి తాను విడాకులు తీసుకుంటున్నట్టు జయం రవి గతేడాది ప్రకటించిన సంగతి తెలిసిందే. కెనీషాతో రిలేషన్ వల్లే ఆర్తికి డివోర్స్ ఇచ్చారంటూ కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి. చెన్నైలో కొన్ని రోజుల క్రితం జరిగిన ఓ పెళ్లి వేడుకలో రవి, కెనీషా జంటగా కనిపించడంతో ఈ వార్తలకు బలం చేకూరినట్లైంది.

## కుబేరకు దేవిశ్రీప్రసాద్ టెన్షన్

### పెండింగ్‌లో రీ రికార్డింగ్ పనులు

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేర అనే సినిమా ప్రేక్షలు ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ధనుష్ హీరోగా, నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో రష్మిక మరో కీలక పాత్రలో నటిస్తోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ దాదాపు ఏడాదిన్నర క్రితం మొదలైంది. సినిమా అనౌన్స్‌మెంట్ అయితే మూడేళ్ల క్రితమే వచ్చింది. ఎట్టకేలకు ఈ సినిమా ఈ నెల 20వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అమెజాన్ ప్రైమ్‌తో ఉన్న అగ్రిమెంట్స్ కారణంగా ఆ విడుదల తేదీని మార్చలేని పరిస్థితి. అయితే సినిమా రిలీజ్‌కు ఇంకా పది రోజులుంది



కానీ ఇంకా ఒక సాంగ్ పూర్తి కాలేదు, అలాగే సినిమా రీ-రికార్డింగ్ కూడా పూర్తి కాలేదు. ఈ విషయాన్ని స్వయంగా నిర్మాత ఏషియన్ సునీల్ తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇక మరో మూడు రోజుల్లో సినిమాకు సంబంధించిన ట్రైలర్ కట్ రిలీజ్ కావాల్సి ఉంది. ఆ తర్వాత మరో రెండు రోజులకు మరో సాంగ్ రిలీజ్ కావాల్సి ఉంది. దేవిశ్రీ ప్రసాద్ కారణంగా ఎప్పుడూ సినిమాకు లాస్ట్ మినిట్ టెన్షన్ ఏర్పడినట్లుగా సినీ వర్గాల వారు చెబుతున్నారు. శేఖర్ కమ్ముల తన టీంతో కలిసి సినిమాకు సంబంధించిన పెండింగ్ వర్క్ పూర్తి చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నాడు. సినిమాకు ఇప్పుడిప్పుడే కాస్త బజ్ పెరుగుతోంది. అయితే దేవిశ్రీ ప్రసాద్ తన అవుట్‌పుట్ ఇచ్చేవరకు సినిమా విషయంలో టెన్షన్ తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ఈ మధ్యకాలంలో సంగీత దర్శకులు రీ-రికార్డింగ్ లేట్ చేయడంతో కొన్నిసార్లు సినిమాలు వాయిదాలు వేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవిశ్రీ ప్రసాద్ ఏం చేస్తాడో చూడాలి.



## విజయ్ దేవరకొండ కింగ్‌డమ్‌కు విఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్

### జూలైకి వాయిదా పడడం ఖాయమంటూ వార్తలు

ఇవాళ భారీ తెలుగు సినిమాలన్నీ విఎఫ్ఎక్స్ మీదనే ఎక్కువగా ఆధారపడి వుంటుతున్నాయి. ఆ వర్క్ కాస్తంత ఆలస్యమైనా... పోస్ట్ ప్రొడక్షన్ లో ఊహకందని జాప్యం ఏర్పడుతోంది. దాంతో సినిమాలను ముందు ప్రకటించిన తేదీకి విడుదల చేయలేని నిస్సహాయ స్థితిలోకి నిర్మాతలు జారిపోతున్నారు. పవన్ కళ్యాణ్ సినిమా కూడా ఈ కారణంగానే వాయిదా పడింది. తాజాగా విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మూవీ మళ్లీ వాయిదా పడేలా ఉంది. ఇప్పటికే మే 30న రిలీజ్ చేస్తామని గతంలోనే ప్రకటించినా.. చివరకు జులై 4కు వాయిదా వేశారు. ఇప్పుడు మళ్లీ వాయిదా వేస్తారని తెలుస్తోంది. కింగ్ డమ్ కంటే ముందే నితిన్ నటించిన తమ్ముడు మూవీ జులై 4న రిలీజ్ డేట్ ప్రకటించింది. తమ్ముడు మూవీ ఉన్నా సరే రిలీజ్ కు ముందు డేర్ చేసింది. కానీ ఇప్పుడు వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు జూన్ 12 నుంచి తప్పుకుంది. చూస్తుంటే వీరమల్లు జులై మొదటి వారంలోనే రిలీజ్ కు రెడీ అవుతున్నట్టు సమాచారం. వీరమల్లు జులై మొదటి వారంలోనే వస్తే తమ కింగ్ డమ్ మూవీని వాయిదా వేసుకుంటామని ఇప్పటికే నాగవంశీ క్లారిటీ ఇచ్చాడు. నిన్న అమేజాన్ తో ముంబైలో వీరమల్లు టీమ్ చర్చలు జరిపింది. ఆల్రెడీ అమేజాన్ వాళ్లు అడ్వాన్స్ ఇవ్వడంతో.. ఇప్పుడు త్వరగా రిలీజ్ చేయాలని ఒత్తిడి పెడుతున్నారంట. వీటన్నింటి నేపథ్యంలో వీరమల్లు జులైకే షిఫ్ట్ అయినట్టు- తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో ప్రకటన కూడా రాబోతోంది. ఎటు చూసుకున్నా కింగ్ డమ్ వాయిదా తప్పేలా లేదు. ఎందుకంటే పోటీ- నడుమ కింగ్ డమ్ ను రిలీజ్ చేయడానికి మేకర్స్ రెడీగా లేరు. సోలోగా వచ్చి ఎక్కువ వసూళ్లు రాబట్టాలని చూస్తున్నారంట. అందుకే మరోసారి వాయిదా వేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. జులై 25కు వాయిదా వేసే అవకాశం ఉంది.

## ముందు అనుకున్న తేదీకే 'తమ్ముడు'

కథానాయకుడు నితిన్ 'తమ్ముడు' సినిమాతో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని శ్రీరామ్ వేణు తెరకెక్కించారు. దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మించారు. సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ కథానాయికలు. లయ, శ్వాసిక కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జులై 4న థియేటర్లలోకి రానున్నట్లు గతంలో ప్రకటించినా.. విజయ్ దేవరకొండ 'కింగ్డమ్' కోసం ఆ తేదీని వదులుకున్నట్లు ప్రచారం వినిపించింది. అయితే ఇప్పుడు చిత్ర బృందం దీనిపై స్పష్టత ఇచ్చింది. దీన్ని ముందుగా అనుకున్నట్లుగానే వచ్చే నెల 4నే విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అంతేకాదు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 11న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. ఇది అక్క-తమ్ముడు అనుబంధాలతో ముడిపడిన కథతో రూపొందిన సినిమా. క్రీడా నేపథ్య అంశాలు మిళితమై ఉంటాయి. ఇందులో నితిన్ ఆర్చరీ క్రీడాకారుడిగా కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీశ్ లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: కె.వి.గుహన్, సమీర్ రెడ్డి, సేతు.



## థామాలో ప్రేమే కీలకం

'సికందర్'తో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది అందాల తార రష్మిక. ప్రస్తుతం వరుస సినిమాలతో జోరుమీదున్న ఈ భామ ఖాతాలో 'థామా' చిత్రం కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఆమె, బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానా జంటగా నటిస్తున్న చిత్రమిది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు ఆదిత్య.. ఇది హారర్ కామెడీ కాదంటూ ఈ సినిమా గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకున్నారు. "మడాక్ సూపర్ నేచురల్ యూనివర్స్‌లో రాబోతున్న ఈ సినిమా మునుపటి చిత్రాల మాదిరిగానే హారర్ కామెడీ నేపథ్యంలో ఉంటుందని అందరూ అనుకుంటున్నారు. కానీ 'థామా' కొన్ని అతీంద్రియ శక్తులతో కూడిన ఓ రొమాంటిక్ చిత్రం. వినోదం ఉన్నా.. ఇందులో ప్రేమే ముఖ్య కథాంశం. ఇంతక ముందు ఈ యూనివర్స్‌లో 'స్త్రీ', 'భేడియా', 'ముంజ్యా' లాంటి హారర్ కామెడీ చిత్రాలనే ఎక్కువ తీర్చిదిద్దాం. అందుకే 'థామా'ను వీటికి పూర్తి భిన్నంగా చూపించాలని ఈ నిర్ణయం తీసుకున్నామ"ని చెప్పుకొచ్చారు. ఈ ఏడాది దీపావళికి విడుదల కానుందీ చిత్రం.

